క్లుప్తంగా

ఘనంగా వేణుగోపాలుడి మాస కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నార్కట్‌పల్లి: మండల కేంద్రంలోని శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం అర్చకులు వేదమంత్రాల నడుమ మాస కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దోసపాటి ప్రసాద్, ఐతరాజు రమేష్, దూదిమెట్ల స్రవంతి, దుబ్బాక శ్రీధర్, జేరిపోతుల భరత్, పసునూరి శ్రీనివాస్, దోసపాటి విష్ణు, సామ కొండల్ రెడ్డి, బెల్లి దశరథ, బండారు రమేష్ పాల్గొన్నారు.

బీజేపీ టూటౌన్ కమిటీ సభ్యులకు నియామక పత్రాలు

నల్లగొండ టూటౌన్: బీజేపీ నల్లగొండ టూటౌన్ కమిటీకి ఉపాధ్యక్షులుగా బొంతు లక్ష్మి, మిర్యాల యాదగిరి, కటకం శ్రీధర్‌లను నియమిస్తూ కమిటీ పట్టణ అధ్యక్షుడు మిర్యాల వెంకటేశ్వర్లు ఉత్తర్వులు అందజేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వెంకన్న, పకీర్‌మోహన్‌రెడ్డి, పిన్నింటి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు

కేతేపల్లి: పదో తరగతి మెమో, టీసీ తీసుకొని వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కేతేపల్లి మండలం తుంగతుర్తి గ్రామ శివారులో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి మండలం చెర్కుపల్లి గ్రామానికి చెందిన వీరబోయిన నాగశంకర్, జటంగి సంపత్ కొర్లపహాడ్‌లో గల మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేశారు. పదో తరగతి మెమో, టీసీ తెచ్చుకునేందుకు సోమవారం బైక్‌పై పాఠశాలకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. తుంగతుర్తి గ్రామ శివారులోకి చేరుకోగానే బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నాగశంకర్, సంపత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో వారిని చికిత్స నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గ్రీస్ దేశంలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం


నల్లగొండ : గ్రీస్ దేశంలో హాస్పిటాలిటీ నిర్వహణ, సేవా రంగాల్లో ఉద్యోగాలు పొందటానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.పద్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్ డిప్లొమా, డిగ్రీ, ఆంగ్ల భాషా ప్రావీణ్యం ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను tomcom.resume@gmail.comకు పంపాలని, పూర్తి వివరాలకు 9440052081 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న మాజీ ఎంపీటీసీ వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు

కేతేపల్లి: కేతేపల్లి మండలకేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన అరోళ్ల పరమేష్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికుడైన రియల్ ఎస్టేట్ వ్యాపారి అవ్వారి అంథోని సోమవారం మృతుడి భార్య గంగమ్మకు రూ.20వేలు ఆర్థికసాయం పంపారు. ఈ నగదును మాజీ ఎంపీటీసీ ఎర్రబోయిన వెంకన్నయాదవ్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బీసీ విభాగం మండల అధ్యక్షుడు బయ్య అంజయ్య, నాయకులు ఎ.ప్రవీణ్, అక్కెనపల్లి శేఖర్, ఎం.పున్నయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ


బ్యాగులు పంపిణీ చేస్తున్న యూత్ ఫర్ సేవ సభ్యులు

కట్టంగూర్ : మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో బ్యాగులను పంపిణీ చేశారు. అలాగే 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పరీక్ష పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ సేవా సభ్యులు సైదులు, తిరుపతి, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం కె.ఆంథోని, ఉపాధ్యాయులు చిన్ని శ్రీనివాస్, విఠల్‌కుమార్ పాల్గొన్నారు.

దిగుబడిపై దిగులు

- అధిక వర్షాలతో దెబ్బతిన్న పత్తిచేలు
- నీళ్లు నిలిచి చేలు ఎర్రబారడంతో సోకిన చీడపీడలు
- గతేడాది కంటే తగ్గనున్న దిగుబడి
- దిక్కుతోచని స్థితిలో పత్తి రైతులు


ఆకారంలో జాలుపట్టి ఎర్రబారి ఎదుగుదల లోపించిన పత్తిచేను

శాలిగౌరారం: ఆరుగాలం కష్టపడి పత్తిపంట సాగు చేస్తున్న రైతులను ఏటా ప్రకృతి వైపరీత్యాలు వెంటాడుతున్నాయి. ఈ సంవత్సరం పత్తిసాగు ప్రారంభంలో అనావృష్టి.. పత్తి మొక్కలు మొలిచిన తర్వాత అతివృష్టి పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. పత్తిచేలు ఎదిగే సమయంలో అధిక వర్షాలు కురువడంతోపాటు యూరియా కొరత కూడా రైతులను దెబ్బతీసింది. అధిక వర్షాలతో ఎరువులు, పురుగుమందుల వినియోగం సకాలంలోచేయకపోవడంతో పత్తిచేను ఎదుగుదల నిలిచిపోవడంతోపాటు చేలలో కలుపు పెరిగిపోయింది. ఎర్ర నేలల్లో సాగుచేసిన పత్తిచేలు జాలుపట్టాయంటే ఇక నల్లనేలలోని పత్తిచేల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. పంట ఎదుగుదల సమయంలో వర్షాలు దెబ్బతీయగా ప్రస్తుత వర్షాలతో చేతికొచ్చిన పంట తడిసి నష్టపోయేలా ఉన్నామని రైతులు తలలు పట్టుకున్నారు.

44,500 ఎకరాల్లో పత్తిసాగు

వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం మండలంలో వానాకాల సీజన్‌లో మొత్తం 44,500 ఎకరాల్లో రైతులు పంటలను సాగుచేశారు. అందులో అత్యధికంగా 23వేల ఎకరాల్లో పత్తిపంట సాగుకాగా 20వేల ఎకరాల్లో వరి, 1,500 ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగుచేశారు.

మూడేళ్ల నుంచి ఇదే పరిస్థితి

పత్తిపంటను సాగుచేసిన రైతులు మూడేళ్లుగా అధిక వర్షాలతో నష్టపోతూనే ఉన్నారు. 2023లో అధిక వర్షాల వల్ల, 2024లో సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పత్తిపంటను సాగుచేసిన రైతులు నష్టపోయారు. ఈసారికూడా అధిక వర్షాలు మరోమారు దెబ్బతీశాయి. ప్రస్తుతం వచ్చిన కొద్దిపాటి పత్తి దిగుబడులను పొందుదామంటే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వచ్చిన దిగుబడులను చేతికి అందకుండా చేస్తున్నాయని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

సగం దిగుబడైనా వచ్చేనా..

అధిక వర్షాల నేపథ్యంలో అధికంగా దెబ్బతిన్న పత్తి చేలు ఈసారి సగం దిగుబడి కూడా వచ్చే పరిస్థితి కనబడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే పత్తిసాగులో నల్లరేగడి భూముల్లో ఎకరంలో గరిష్టంగా 18–20 క్వింటాళ్లు, ఎర్ర నేలల్లో 15–18 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో పంట దిగుబడులు పడిపోవడంతో నల్ల భూముల్లో ఎకరంలో గరిష్ఠంగా 8 క్వింటాళ్లు, ఎర్ర నేలల్లో 6 క్వింటాళ్ల దిగుబడులు వచ్చే అవకాశాలు కూడా ఉండకపోవడంతో పెట్టుబడులు కూడా పూడే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక కౌలురైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

పత్తిపంట సాగుచేసి అప్పుల పాలయ్యాను



నాకున్న రెండెకరాలతోపాటు 8ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తిపంట సాగుచేశాను. మాది లోతట్టు భూమి కావడంతో అధిక వర్షాలకు నీరు నిలిచి చేనంతా ఎర్రబారి ఎదుగుదల లోపించింది. ఎకరాకు 3 క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితిలేదు. పత్తిసాగు చివరకు అప్పులపాలు చేసింది.

– రావర్తి రామలింగయ్య, రైతు, పెర్కకొండారం

అనుకున్న దిగుబడి వచ్చేలా లేదు



నాకున్న మూడు ఎకరాల భూమిలో పత్తిపంట సాగుచేశాను. ఈసారి వర్షాలు ఎక్కువగా పడటంతో చేనుమొత్తం జాలుపట్టి ఎర్రబారి దెబ్బతిన్నది. దీంతో అనుకున్న దిగుబడిలో సగం కూడా వచ్చే పరిస్థితి లేదు. వచ్చిన దిగుబడులు పెట్టుబడులకు కూడా సరిపోయేలా లేదు.

– భూపతి మహేశ్, రైతు, వల్లాల

మూడేళ్లుగా నష్టపోతున్నాం



మూడేళ్లుగా పదెకరాల్లో పత్తిపంట సాగుచేస్తూ వస్తున్నాను. ఒక సంవత్సరం అతివృష్టి, రెండవ సంవత్సరం అనావృష్టితో పత్తిపంట దెబ్బతిని ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక నష్టాల పాలయ్యాను. ఈసారి అధిక వర్షాలు దెబ్బతీశాయి. ఇప్పుడు కూడా నష్టపోయే పరిస్థితే నెలకొంది.

– మిట్టం సత్తిరెడ్డి, రైతు, ఆకారం

కేంద్రాలకు వచ్చిన ధాన్యమంతా కొంటాం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


నకిరేకల్ : కడపర్తిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్: రైతులు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యమంతా ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని, రైతులు అధైర్యపడొద్దని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం భరోసా ఇచ్చారు. నకిరేకల్ మండలం గోరెంకపల్లి, మంగళపల్లి, చందంపల్లి, కడపర్తి గ్రామాల్లో పీఏసీఎస్, డీసీఎంఎస్, రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వర్షాలు వస్తున్నందున్న రైతులు ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా ఆరబెట్టిన తరువాత కొనుగోలు చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరి, ఏడీఏ జానిమియా, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వేంకటేశ్వర్‌రావు, పీఏసీఎస్ సీఈఓ జగన్‌రెడ్డి, ఐఆర్‌డీఎస్ సంస్థ అధ్యక్షుడు వాడపల్లి రమేష్, ఎఫ్ఓలు భూపతి శ్రీనివాస్, యంపల్ల దశరథరెడ్డి, వాడపల్లి శ్రీను, కాంగ్రెస్ నాయకులు బచ్చుపల్లి గంగధర్‌రావు, నకిరేకంటి ఏసుపాదం, నకిరేకంటి నరేందర్, దాసరి వీరార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

శాలిగౌరారం: మండలంలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని శాలిగౌరారం తహసీల్దార్ వరప్రసాద్ అన్నారు. సోమవారం శాలిగౌరారం తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ, ఐకేపీ, పీఏసీఎస్‌ల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రాలకు వచ్చి చేరుతున్న ధాన్యం వర్షమొస్తే తడవకుండా చూడాలన్నారు. సమావేశంలో ఏఓ సౌమ్యశృతి, ఐకేపీ ఏపీఎం శంకరయ్య, పీఏసీఎస్ సీఈఓ నిమ్మల ఆంజనేయులు, మండల అదనపు ఆర్ఐ రఫీ, ఏఈఓలు, గ్రామ పాలన అధికారులు, కేంద్రాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.


శాలిగౌరారం : మాట్లాడుతున్న తహసీల్దార్ వరప్రసాద్

ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి


నల్లగొండ టూటౌన్ : కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్: జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యదర్శి గోలి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి కోరారు. బీజేపీ, కిసాన్‌మోర్చా జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో వర్షాలకు ధాన్యం తడిసి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లినుందన్నారు. ప్రతి సెంటర్‌లో సరిపడా డ్రయర్లు, బస్తాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు. లారీలు, హమాలీల కొరత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పోతే పాక లింగస్వామి, మండలి వెంకన్న, కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, గుండా నవీన్‌రెడ్డి, ఓంప్రకాష్, పకీర్‌మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాపిరెడ్డి పాల్గొన్నారు.

తడిచిన ధాన్యంను కొనుగోలు చేయాలి

చిట్యాల: కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చి వర్షాలకు తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా మద్దతు ధరతో కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య డిమాండ్ చేశారు. చిట్యాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం వారు పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఐతరాజు నర్సింహ, సీపీఎం నాయకులు బొబ్బలి వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాబురావు, శ్రీశైలం, తిరుమలేష్, మల్లారెడ్డి పాల్గొన్నారు.


చిట్యాల : తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

భారీ వర్షం.. తడిసిన ధాన్యం


శాలిగౌరారం మార్కెట్‌యార్డులో ఆరబోసిన ధాన్యం

- శాలిగౌరారంలో 25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- కొనుగోలు కేంద్రాల్లోకి చేరిన వరద


తిప్పర్తి : నీటిలో ధాన్యాన్ని ఎత్తుకుంటున్న రైతులు

శాలిగౌరారం: తుపాను ప్రభావంతో శాలిగౌరారం మండలంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఎడతెరిపిలేకుండా భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలో 25 మిల్లీమీటర్లు (2.5 సెంటీమీటర్లు) వర్షపాతం నమోదైంది. పలు కొనుగోలు కేంద్రాల్లో క్వింటాళ్లకొద్దీ ధాన్యం తడిసిపోయింది. లోతట్టు ప్రాంతంలో పోసిన ధాన్యం కొన్నిచోట్ల వర్షపు వరదనీటికి కొట్టుకుపోగా మరికొన్నిచోట్ల ధాన్యం రాశుల చుట్టూ వర్షపు నీరు నిల్వ చేరింది. శాలిగౌరారం మార్కెట్‌యార్డు ఆవరణ అధికంగా సీసీ ప్లాట్‌ఫాం కావడంతో వరద ధాటికి ధాన్యం కొట్టుకుపోయింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు. ఇదిలా ఉండగా శాలిగౌరారం మండలంలోని పలు గ్రామాల్లో కోతదశలో ఉన్న వరిపంట చేలు నేలవాలాయి.

తడిసిన ధాన్యం.. రైతులకు నష్టం

తిప్పర్తి : మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి తిప్పర్తి మార్కెట్ యార్డులో పోసిన ధాన్యం తడిసింది. ఈ మార్కెట్‌లో ఆరు రోజుల క్రితం పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించగా రైతులు ధాన్యం తెచ్చి రాశులుగా పోసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వర్షం రావడంతో ధాన్యం తడిసి నష్టపోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి మమ్ములను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


శాలిగౌరారం మార్కెట్‌యార్డులో కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుకుంటున్న రైతు


నాంపల్లి : ఉధృతంగా పారుతున్న ముష్టిపల్లి వాగు


నాంపల్లి : పసునూర్ పెద్దచెరువు అలుగు ప్రవాహం

అలుగు పోస్తున్న చెరువులు


చిట్యాల: అలుగు పారుతున్న కందోనిచెరువు

చిట్యాల, నాంపల్లి: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిట్యాల మండలం బొంగోని చెర్వు గ్రామంలోని కందోనిచెరువు మూడు రోజులుగా మత్తడి దూకుతుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతోపాటు పిల్లాయిపల్లి కాల్వ ద్వారా వస్తున్న వరద వచ్చి చేరడంతో చెరువు పూర్తిస్థాయిలో నిండిపోయి అలుగు పోస్తోంది. అలాగే నాంపల్లి మండలంలోని పసునూర్, దేవత్‌పల్లి, ముష్టిపల్లి గ్రామాల చెరువులు అలుగులు పోస్తున్నాయి. దీంతో ముష్టిపల్లి వాగు ఉధృతంగా పారుతుండడంతో నాంపల్లి –కొండమల్లేపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డుపై వాహనాదారులు, ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

స్కూళ్ల పర్యవేక్షణకు టీచర్లను నియమించొద్దు

నల్లగొండ: పాఠశాలల పర్యవేక్షణకు ఉపాధ్యాయులతో కమిటీలు నియమించొద్దని, ఇది పాఠశాల విద్యకు తిరోగమన చర్య అని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశం అన్నారు. సోమవారం నల్లగొండలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన డీటీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1,473 మంది ఉపాధ్యాయులను పర్యవేక్షణ అధికారులుగా నియమించడం.. విద్యార్థుల విద్యాబోధనకు దూరం చేయడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న డీఈఓ, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకులు, జిల్లా ఉపాధ్యక్షులు ఏడుకొండలు, పుష్ప, జిల్లా కార్యదర్శులు జగతి, వెంకటేశ్వర్లు రాష్ట్ర కౌన్సిలర్లు ఖుర్షద్ మియా, ఈద అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి డ్రెయినేజీతో అవస్థలు

నాంపల్లి: మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డు నాలుగు లేన్ల విస్తరణ పనుల్లో భాగంగా నూతన నిర్మించిన సైడ్ డ్రెయినేజీలను అసంపూర్తిగా వదిలేశారు. దీంతో అందులో చేరిన మురుగు, వర్షపు నీరు ఎటూ సాఫీగా పోకపోవడంతో దుర్వాసన వస్తుంది. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మురుగు నీరు వల్ల దోమలు అధికమై సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం పొంచి ఉందని, వెంటనే మురుగునీరు సాఫీగా పోయేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


అసంపూర్తి డ్రెయినేజీలో నిలిచిన మురుగు నీరు

సమస్యలు పరిష్కరించాలని వినతి

మునుగోడు : మునుగోడులోని ఎస్సీ కాలనీలో నెలకొన్న పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యను పరిష్కరించాలని జాతీయ మాల మహానాడు సంఘం నాయకుడు బెల్లపుబాలశిరాజు కోరారు. ఈ మేరకు సోమవారం నల్లగొండలో కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు.

గాంధీజీ లక్ష విగ్రహాల సేకరణ ప్రారంభం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు

చండూరు : గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంస్థ స్వర్ణోత్సవాల్లో భాగంగా లక్ష గాంధీజీ విగ్రహాల సేకరణ కార్యక్రమాన్ని చండూరులోని గాంధీజీ విద్యాసంస్థల ప్రాంగణం నుంచి ప్రారంభిస్తున్నట్లు గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంస్థ వైస్ చైర్మన్ యానాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం పాఠశాలలో లక్ష విగ్రహాల సేకరణ కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం దక్కేలా లక్ష విగ్రహాల సేకరణ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు 10 విగ్రహాలకు గాను రూ.15వేల విరాళాన్ని ప్రభాకర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్మా ప్రధాన కార్యదర్శి బీవీ.రావు, రాష్ట్ర నాయకులు వెంకట్‌రెడ్డి, గొట్టిపర్తి చంద్రశేఖర్, పల్లె శ్రీనివాస్‌గౌడ్, శిరంశెట్టి శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


రామగిరి(నల్లగొండ) : అప్పాజీపేటలో పోషణ మాసంలో పాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది, గర్భిణులు


మునుగోడు: గంగోరిగూడెంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి


నకిరేకల్ : తాటికల్‌లో పోషణ మాసంలో పాల్గొన్న అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది


కనగల్ : మాట్లాడుతున్న సూపర్‌వైజర్ మంజుల

రామగిరి(నల్లగొండ): పోషకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ నిర్మల అన్నారు. నల్లగొండ మండలం అప్పాజీపేట అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన పోషణ మాసం ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామంలో జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు బాల్య వివాహాలు విటమిన్స్ లోపం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ, హెడ్ మాస్టర్ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

డైట్‌లో అవగాహన సదస్సు

నల్లగొండ : పోషణ మాసంలో భాగంగా సోమవారం నల్లగొండలోని డైట్ హైస్కూల్‌లో కిశోర్ బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కిషోర్ బాలికలు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో వివరించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.సరస్వతి, అంగన్వాడీ టీచర్లు విజయలక్ష్మి, రేణుక, నళిని, ఆర్పీ.రాజేశ్వరి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చందునాయక్ తదితరులు పాల్గొన్నారు

ఆకుకూరలు, పండ్లు అధికంగా తినాలి

మునుగోడు: గర్భిణులు, బాలింతలు అధికంగా ఆకుకూరలు, పండ్లు తినడం ద్వారా రక్తహీనతను అరికట్టవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. పోషణ మాసంలో భాగంగా సోమవారం మునుగోడు మండలం గంగోరిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషక ఆహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీ యాదయ్య, వీఓఏ బాలావతి, ఉపాధ్యాయులు లింగస్వామి, రామ్మూర్తి, స్నేహలత, నాగరాజు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాన అవసరం

నకిరేకల్ : వ్యక్తిగత, పరిసరాల పరిశ్రుభ్రతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని నకిరేకల్ ఎంఈఓ మేక నాగయ్య కోరారు. నకిరేకల్ మండలం తాటికల్ జెడ్పీ హైస్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పండుగ తిరుమలయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగకుమారి, నాగమణి, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

కనగల్: మండలంలోని కురంపల్లి హైస్కూల్‌లో సోమవారం జాతీయ పోషణ మాసోత్సవం సందర్భంగా పోషకాహారంపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంజుల అవగాహన కల్పించారు. కిషోర్ బాలికలు రక్తహీనత బారిన పడకుండా తగు సూచనలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు పోషకాహారంపై వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శేఖర్, అంగన్‌వాడీ టీచర్ సుజాత, ఏఎన్ఎం అరుణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చెప్పిన నిబంధనలు పాటించాలి

- మునుగోడు నియోజకవర్గంలో వైన్ షాపులకు టెండర్లు వేసే వారికి స్థానిక కాంగ్రెస్ నాయకుల సూచన
- నల్లగొండ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతి


ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నల్లగొండ: మునుగోడు నియోజకవర్గ పరిధిలో వైన్ షాపులకు టెండర్లు వేసే వారు స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్పిన నిబంధనలు పాటించాలని నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సూచించారు. ఎమ్మెల్యే సూచించిన విధంగా మునుగోడు నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో అదే మండలానికి చెందిన వారు వైన్ షాపు టెండర్‌కు దరఖాస్తు చేసుకోవాలని, బెల్ట్ షాపులు పెట్టొద్దని పేర్కొన్నారు. టెండర్ దక్కించుకున్న వారు సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు మాత్రమే మద్యం విక్రయించాలని, వైన్ షాపులను ఊరి బయట ఏర్పాటు చేయాలని, పర్మిట్ రూమ్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దని, సిండికేట్‌కు అవకాశం ఉండొద్దని సూచించారు. ఈ మేరకు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు నారబోయిన రవి ఆధ్వర్యంలో మునుగోడు, చండూరు, నాంపల్లి మండలాలకు చెందిన నాయకులు పల్లె వెంకన్న, రవీందర్‌రెడ్డి, పూల వెంకటయ్య, సంజీవరెడ్డి, రఘుపతిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, దోటి వెంకటేష్‌యాదవ్, చంద్రశేఖర్‌గౌడ్ కలిసి సోమవారం నల్లగొండ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. అంతకుముందు ఎక్సైజ్ కార్యాలయం ముందు ఎమ్మెల్యే సూచించిన నిబంధనలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు.